నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 19 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

అర్హతకు మించి వైద్యమందిస్తే చర్యలు

మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.అనిత

మంచిర్యాల ఏసీసీ, మే 18 : అర్హతకు మించి వైద్యమందిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత అన్నారు. శనివారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రైవేట్ ఆర్ఎంపీ, పీఎంపీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్ఎంపీ, పీఎంపీలందరూ ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని, పేరు పక్కన డాక్టర్ అని రాసుకోరాదని, క్లినిక్‌లో ఎలాంటి మందులు ఉండరాదని, ప్రిస్క్రిప్షన్ రాయరాదని సూచించారు. జిల్లాలో జాతీయ కౌన్సిల్, స్టేట్ కౌన్సిల్ ద్వారా ఆర్ఎంపీలు, పీఎంపీ క్లినిక్‌లలో తనిఖీలు కొనసాగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వైద్యమందిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిమోబుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వంతెనల కోసం అనువైన స్థలాల పరిశీలన

ఓవర్ పాస్ వంతెనల నిర్మాణాలకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్న అటవీ, రైల్వే అధికారులు

సిర్పూర్(టీ), మే 18 : సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ పరిధిలో అటవీ గుండా వెళ్లే రైలు మార్గాన్ని శనివారం శాంతారామ్ (ఎఫ్‌డీపీటీ), జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ రైల్వే అధికారులతో పరిశీలించారు. వన్యప్రాణులు సురక్షితంగా రైల్వే మార్గాన్ని దాటేందుకు ఓవర్ పాస్ వంతెనల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. దట్టమైన అటవీ ప్రాంతం ఉండడం వల్ల పులులు.. తదితర వన్యప్రాణులు ప్రమాదాల బారిన పడకుండా ఉపయోగపడతాయన్నారు. రైల్వే అధికారులు ద్రోణాచార్య, గంట శ్రీనివాస్, సిర్పూర్(టీ) రేంజ్ అధికారి పూర్ణ చందర్ రావు, సెక్షన్ అధికారి వోల్క మోహన్‌రావు, బీట్ అధికారులు షాహిద్, నరేశ్ పాల్గొన్నారు.

జడ్పీ సమావేశం గరం.. గరం..

- ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ అధ్యక్షతన మీటింగ్
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ సభ్యులు
- ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆగ్రహం
- ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయంటూ అసహనం
- అక్రమంగా ఇసుక తరలిస్తున్నా ఎందుకు స్పందించడం లేదని నిలదీత
- ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీపై విచారణ జరిపించాలని డిమాండ్
- రోడ్ల పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని పట్టు
- అటవీ అధికారులు ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ధాన్యం కొనుగోళ్లపై ఇంత నిర్లక్ష్యమెందుకని ప్రశ్న
- డీఎఫ్‌వో అప్పల కొండ సరెండర్‌కు తీర్మానం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, చిత్రంలో జడ్పీ చైర్మన్ కృష్ణారావు, అదనపు కలెక్టర్

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ) : ఆసిఫాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అధ్యక్షతన.. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధ్వర్యంలో శనివారం జరిగిన జడ్పీ సమావేశం గరం గరంగా సాగింది. ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, అభివృద్ధి ఆగిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పలేపోయారు. ముఖ్యంగా అటవీ, పంచాయతీరాజ్, మైనింగ్, వైద్యాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అటవీ అధికారుల దురుసు ప్రవర్తన వల్ల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాలకు రోడ్లు వేయకుండా, కనీసం తాగునీటికి బోర్లు వేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఇక ఇంజినీరింగ్ అధికారుల వైఖరితో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయన్నారు. టెండర్లు జరిగినా పనులు ప్రారంభించడం లేదని తెలిపారు. జిల్లా లో ఇసుక మాఫియా చెలరేగిపోతున్నదని, మైనింగ్ అధికారుల అవినీతి వల్లే రోజూ వందల లారీల్లో ఇసుక తరలిపోతుందని, రాత్రి వేళల్లో ఆదిలాబాద్ ప్రాంతానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారని, అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుంటే మైనింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని సభ్యులు ప్ర శ్నించారు. మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఏ ప్రాతిపదికన ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లాతో సంబంధం లేని వ్యక్తికి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని అప్పజెప్పటం వల్ల ఇష్టానుసారంగా నియమాకాలు జరుగుతున్నాయన్నారు. ఐదుగురు సభ్యుల కమిటీతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను భర్తీచేయాల్సి ఉండగా, ఏజెన్సీ వాళ్లు ఇష్టానుసారంగా పోస్టులను భర్తీచేశారని ఆరోపించారు. దీనిపై వి చారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు మ ధ్యలోనే ఆపేస్తున్నారని, ఒక్కో కాంట్రాక్టర్ పదుల సంఖ్యలో పనులు తీసుకుంటున్నారని, పనులు త్వరగా పూర్తిచేసేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకువచ్చే పరిస్థితి కూడా అధికారుల్లో లేదన్నారు. పనులను అర్ధాంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు.

సమావేశానికి హాజరైన సభ్యులు

డీఎఫ్‌వో సరెండర్‌కు తీర్మానం..

ఆసిఫాబాద్ అటవీ డివిజన్ అధికారి అప్పల కొండను సరెండర్ చేసేందుకు స భ్యులు తీర్మానించారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకునేలా వ్యవహరిస్తున్నారని, తరతరాలుగా అడవుల్లో ఉంటున్న గ్రామాలకు రోడ్లు వేయకుండా, కనీసం తాగునీటి వసతి కల్పించకుండా అడ్డుకోవడమేమిటని మండిపడ్డారు. పట్టాలు కలిగిన భూముల్లో కూడా వ్యవసా యం చేయకుండా అడ్డుకుంటున్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యేతో పాటు ఇతర సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆసిఫాబాద్ డివిజనల్ అటవీ అధికారిని సరెండర్ చేయాలని సభ్యులు తీర్మానించారు.

అటవీ అధికారుల తీరుతో అన్యాయం

అటవీ అధికారుల తీరుతో అదివాసీలకు తీరని అన్యాయం జరుగుతోంది. కనీసం తాగునీటి కోసం బోర్లు కూడా గిరిజన గ్రామాల్లో వేయలేని పరిస్థితి వచ్చింది. అటవీ హక్కుల పట్టాలున్న భూముల్లో కూడా గిరిజనులు సాగు చేసుకోలేక పోతున్నారు. డీఎఫ్‌వోకు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. వందేళ్ల క్రితం నుంచి అడవుల్లో ఉంటున్న గిరిజన గ్రామాలకు కూడా రోడ్డు వేయలేని పరిస్థితి ఎందుకొస్తుంది. ముఖ్యంగా ఆసిఫాబాద్ అటవీ డివిజన్ అధికారి తీరుతో ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అడవుల్లో చేపట్టే పనులకు అడ్డురాని చట్టాలు ఆదివాసీల గ్రామాలకు రోడ్డువేస్తే ఎందుకు అడ్డువస్తున్నాయి. ఇటీవల రెబ్బెన మండలం తుంగెడ గ్రామ శివారులో పట్టా భూముల్లో సాగుచేసుకుంటున్న గిరిజనులపై అటవీ అధికారులు దాడులు చేసి కేసులు పెట్టారు. తిర్యాణి మండలం గుండాల గిరిజనులు దవాఖానకు వెళ్లడానికి కూడా దారిలేకుండా చేశారు. పెన్షన్ తీసుకోవడానికి కూడా 30 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదివాసీలు తిరగబడితే అటవీ అధికారులు అడవుల్లో తిరుగ గలరా. అడవుల్లో స్మగ్లింగ్ చేస్తున్న అసలు దొంగలు అటవీ అధికారులే. డీఎఫ్‌వో అప్పల కొండని సరెండర్ చేయాలి.

- కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్

కొనుగోళ్లపై ఇంత నిర్లక్ష్యమా..

ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. జిల్లాల్లో 31 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉంటే, ఇప్పటి వరకు కేవలం 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. మిగతా ధాన్యం ఇంకెప్పుడు సేకరిస్తారు. మరో 20 రోజుల్లో వర్షాలు వస్తాయి. అధికారుల తీరువల్ల ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో కూడా భారీ మోసాలు జరుగుతున్నాయి. దహెగాంలోని ఒడ్డుగూడ కొనుకొగోలు కేంద్రంలో తూకంలో మోసాలకు పాల్పడ్డ వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలి. ఇప్పటికైనా అధికారులు కొనుగోలు కేంద్రాలను పెంచి ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలి. కాగజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయి. 288 ఇండ్లను త్వరగా లబ్ధిదారులకు ఇవ్వాలి. అటవీ అధికారుల వల్ల నిలిచిపోయిన రోడ్ల పనులు తిరిగి ప్రారంభించాలి. ఆర్‌అండ్‌బీ అధికారులకు సాధ్యం కాకపోతే పనుల బాధ్యతలను తమకు అప్పగించాలి. **- హరీశ్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్**

భీమారం మేజర్ గ్రామ పంచాయతీ భవనం

సారంగపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పంచాయతీలకు మొండి'చేయి'

ఇప్పటి దాకా రూపాయి విదిల్చని కాంగ్రెస్ సర్కారు

- ఆర్థిక సంవత్సరం ముగియడంతో ఏప్రిల్‌లో ఉన్న నిధులన్నీ వెనక్కి
- స్పెషల్ ఆఫీసర్ల పాలనలో పట్టించుకునే నాథుడే కరువు
- భారం అంతా పంచాయతీ కార్యదర్శులపైనే..
- అప్పుల పాలవుతున్నామంటూ అధికారుల గగ్గోలు

మంచిర్యాల, మే 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రతి గ్రామ పంచాయతీకి ఓ కార్యదర్శి, చెత్త సేకరణకు ఒక ట్రాక్టర్, ప్రతి ఊరిలో ఒక శ్మశానవాటిక, డంప్ యార్డు, పల్లె ప్రకృతి వనాలు.. ఇలా ఎన్నో అద్భుతాలతో కేసీఆర్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పల్లెలు.. నేడు కష్టాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పంచాయతీలకు ఒక్క పైసా కూడా నిధుల రూపంలో విడుదల చేయలేదు. పంచాయతీల బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవడంతో పాలన పడేసింది. నిధులు ఇవ్వకపోగా కేసీఆర్ సర్కార్ ఉన్నప్పుడు గతేడాది ఇచ్చిన నిధులు 2023-24 సంవత్సరానికి సంబంధించి పంచాయతీల్లో మిగిలిన డబ్బులను ఏప్రిల్ నెలలో వెనక్కి తీసుకుంది. అలాంటప్పుడు ప్రతినెలా ఇవ్వాల్సిన డబ్బులైనా సమయానికి ఇస్తుందని ఆశ పడితే.. మొండిచేయి చూపిస్తున్నది. కేసీఆర్ హయాంలో పంచాయతీలకు ప్రతి నెలా రంఫన్‌గా నిధులు వచ్చేవి. దీంతో నిర్వహణకు ఇబ్బందులు లేకుండేవి. ట్రాక్టర్లు, పారిశుధ్య పనులు, సిబ్బంది జీతాలు అన్నింటికీ సకాలంలో డబ్బు సమకూరేవి. కానీ.. ఇప్పుడా పరిస్థితి గ్రామాల్లో కనిపించడం లేదు. మల్టీ పర్పస్ వర్కర్లకు మూడు, నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదు. ఇక ఊర్లలోని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు నియమించుకున్న కార్మికులకు కూడా డబ్బులు ఇవ్వలేని దుస్థితి. పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులతో కరెంట్ బిల్లులు కట్టాల్సిన దుస్థితి. వీధి దీపాలు, డంపింగ్ యార్డులు, ట్రాక్టర్ల నిర్వహణ ఈ భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతున్నది.

తాగునీటికి రూ.లక్ష ఏమైపోయాయి

గడిచిన పదేళ్లలో ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది రాష్ట్రంలో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయి. పైప్‌లైన్‌లకు మరమ్మతు చేయలేక చాలా గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచింది. దీంతో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తాగునీటి సరఫరాకు ప్రత్యేకమైన నిధులు వస్తున్నాయి. ప్రతి పంచాయతీకి రూ.లక్ష ఇస్తాం. ముందైతే ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలంటూ పంచాయతీ కార్యదర్శులకు చెప్పారు. ఈ విషయంలో ఇబ్బందులు వస్తే ఉన్నతాధికారులు కార్యదర్శులనే బాధ్యులను చేశారు. దీంతో చేసేది ఏం లేక ఒక్కో కార్యదర్శి రూ.30 వేల నుంచి రూ. ఒక లక్ష వరకు అప్పులు తెచ్చి తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు ఇలా రకరకాల పనులపై పెట్టారు. తీరా ఇప్పుడు పనులైపోయాక ఆ లక్ష రూపాయాల విషయం కూడా మాట్లాడే నాథుడే కరువయ్యారు. అప్పుల పాలైపోతున్నాం సార్ అంటూ పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. పంచాయతీల్లో పాలకవర్గానికి గడువు ముగియడంతో స్పెషల్ ఆఫీసర్లను నియమించినా.. వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదు. పాలకవర్గాలు లేకపోవడం, స్పెషల్ ఆఫీసర్ రాకపోవడంతో ప్రతి దానికి మేమే బాధ్యత వహించాల్సి వస్తుందంటూ బాధపడుతున్నారు.

మంచిర్యాల జిల్లాలో పంచాయతీల పరిస్థితి..

మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో 14 పంచాయతీల ట్రాక్టర్ల ఈఎంఐలు పెండింగ్‌లో ఉన్నాయి. కోనూర్, కొండాపూర్, కోమటిచేను, పెద్దనపల్లి, కాసిపేట పంచాయతీల్లో మల్టీపర్సస్ వర్కర్ల జీతాలు ఐదారు నెలలుగా రావడం లేదు. పంచాయతీ కార్యాలయాల కరెంట్ బిల్లులు కట్టాల్సి ఉంది. తాండూర్ మండలంలో 15 పంచాయతీలు ఉండగా మేజర్ పంచాయతీలో మినహా మిగిలిన 14 పంచాయతీల బ్యాంక్ ఖాతాలు ఖాళీగా ఉన్నాయి. కిష్టంపేట, రాజీవ్‌నగర్, రేచిని, నీలాయిపల్లి గ్రామాల్లో సిబ్బందికి వేతనాలు, కరెంట్ బిల్లులు రావాలి. దండేపల్లి మండలంలోని 31 గ్రామాల్లో ధర్మరావుపేట పంచాయతీలో ట్రాక్టర్ ఈఎంఐ పెండింగ్‌లో ఉంది. హాజీపూర్ మండలంలో 17 పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామంలో మల్టీపర్సస్ ఉద్యోగులకు వేతనాలు నాలుగైదు నెలలవి చెల్లించాలి. కొన్ని పంచాయతీలు కరెంట్ బిల్లులు బకాయిలు ఉన్నాయి. నెన్నెల మండలంలో 19 పంచాయతీలు ఉండగా పలు పంచాయతీల్లో వేతనాలు కొన్ని నెలలవి ఇవ్వలేదు. భీమారం మండలంలో 11 పంచాయతీలు ఉండగా.. భీమారం మేజర్ పంచాయతీలో రూ.5,85,500 విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ధర్మారం గ్రామంలో రూ.లక్ష, పొలంపల్లిలో రూ.21 వేలు, కొత్తపల్లిలో రూ.30 వేలు, ఎల్కేస్వరంలో రూ.50 వేలు, దంపూర్‌లో రూ.30 వేలు, కాజీపల్లిలో రూ.30 వేల విద్యుత్ బిల్లులు బకాయిలు చెల్లించాలి. జైపూర్ మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. మూడు, నాలుగు గ్రామ పంచాయతీల్లో వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మందమర్రి మండలంలో 8 పంచాయతీలు ఉండగా సారంగపల్లి, పొన్నారం, మామిడిగట్టు, అదిలాపేట్, చిర్రకుంట గ్రామాల్లో వర్కర్లకు జీతాలు చెల్లించాలి. చెన్నూర్ రూరల్, బెల్లంపల్లి రూరల్, కన్నేపల్లి, భీమిని మండలాల్లోనూ దాదాపు ఇదే దుస్థితి నెలకొంది.

త్వరలో నిధులు వస్తాయి..

పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు త్వరలోనే మంజూరవుతాయి. అప్పుడు పెండింగ్ పడిన వేతనాలు, ట్రాక్టర్‌ల ఈఎంఐలు అన్ని చెల్లిస్తాం. పంచాయతీల్లో పనులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంట్స్ కొన్ని నెలలుగా పెండింగ్ ఉన్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు వస్తాయి.

- వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, మంచిర్యాల.

జీపీల్లో పడకేసిన పాలన

కౌటాల మండలం తాటినగర్‌లో..

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని 334 గ్రామ పంచాయతీల్లో పాలన పడకేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో పంచాయతీల నిర్వహణ గాడితప్పి పరిస్థితి అధ్వానంగా మారుతున్నది. టాక్సీల రూపంలో వచ్చే నిధులను కరంటు బిల్లులకు చెల్లిస్తున్నారు. ట్రాక్టర్ల నిర్వహణ కూడా పంచాయతీలకు కష్టంగా మారింది. ట్రాక్టర్ల మెయింటనెన్స్, డీజిల్, మరమ్మతుల కోసం పంచాయతీ కార్యదర్శులు బయట నుంచి అప్పులు తీసుకొచ్చి పెట్టాల్సి వస్తున్నది. వైకుంఠ ధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ కష్టంగా మారగా, అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. కేసీఆర్ సర్కారులో ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించగా, అద్భుతమైన పాలన సాగింది. కానీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిధులు విడుదల కాక అభివృద్ధి కుంటుపడుతున్నది. ఆరేడు నెలలుగా పారిశుధ్య సిబ్బందికి వేతనాలు అందించలేని దుస్థితి నెలకొంది. వానకాలంలో కూడా ఆర్థిక పరిస్థితి ఇలాగే ఉంటే ఇబ్బందులు తప్పవని అధికారులు అంటున్నారు.

పెంచికల్‌పేట్‌లో మూలనపడ్డ ట్రాక్టర్, ట్రాలీ

ఇల్లు గడవడం కష్టంగా ఉంది

మా ఊరిలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న. కొన్ని నెలలైతుంది జీతాలు ఇవ్వక. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. కనీసం ఇంటికి అవసరమైన సరుకులు కొందామన్నా చిల్లి గవ్వ లేకుంటైంది. దుకాణపోళ్లు ఉద్దెర ఇవ్వడం లేదు. ఇది వరకు మంచిగనే జీతాలిచ్చేటోళ్లు. ఇప్పుడు మస్తు కష్టమైతంది. గీ పని బంద్ చేసి ఏదైనా కూలీ పనులకు పోతే మంచిగుండు అనిపిస్తుంది. ఇప్పటికైనా సర్కారోళ్లు స్పందించి మా జీతాలివ్వాలి.

- పాముల రాము, పారిశుధ్య కార్మికుడు, పెంచికల్‌పేట్

దిందాలో నరికిన చెట్లను పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు

అడవుల నరికివేతపై విచారణ

- ఎఫ్ఎస్‌వో అక్తర్‌పై ఫిర్యాదు నేపథ్యంలో దిందా ఫారెస్ట్ పరిశీలన

చింతలమానేపల్లి, మే 18 : కర్జెల్లి రేంజ్ పరిధిలోని దిందా బీట్‌లో చెట్ల నరికివేతకు సహకరించడంతో పాటు ఫారెస్ట్ భూమిని కొందరికి అప్పగించేందుకు సహకరిస్తున్నాడంటూ పలువురు గూడెం ఎఫ్ఎస్‌వో అక్తర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం దిందా బీట్‌లోని పలు కంపార్ట్‌మెంట్‌లలో జిల్లా డిప్యూటీ రేంజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి సీహెచ్ రాజేశ్వరాచారి, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఎస్‌వో ఎండీ నాజర్ హుస్సేన్ విచారణ చేపట్టారు. చాలా వరకు నరికి ఉన్న టేకు చెట్ల మొదళ్లను గుర్తించారు. బండేపల్లి బీట్‌లోనూ అధికంగా అడవి నరికివేతకు గురైనట్లు వివరాలు సేకరించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని వారు తెలిపారు. చెట్లు నరికివేసి అటవీ భూమిని ఆక్రమించిన బండేపల్లికి చెందిన దన్నూరి సురేశ్‌పై ఈ నెల 14న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కర్జెల్లి రేంజ్ పరిధిలో అటవీశాఖ అధికారులే దగ్గరుండి స్మగ్లింగ్ చేయిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈ అంశంపై పలువురిపై సస్పెన్షన్ వేటు వేశారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్

నస్పూర్, మే 18 : రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు సమయపాలన పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హరికృష్ణ, జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి రేషన్ డీలర్లు, గోదాముల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యం అందిస్తున్నదని, రేషన్ డీలర్లు ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. దుకాణాల్లో రేషన్ డీలరు పేరు, మొబైల్ నంబర్, స్టాకు నిల్వల పంపిణీ వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వాంకిడి, మే 18 : మండలంలోని సరాండి టోల్ ప్లాజా వద్ద శనివారం 123 క్వింటాళ్ల 30 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆసిఫాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ తెలిపారు. టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఐచర్ వ్యాన్‌లో మహారాష్ట్రకు తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని ఆసిఫాబాద్ పాయింట్‌కు తరలించామని, ఐచర్ వ్యాన్‌ను సీజ్ చేసి వాంకిడి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

బియ్యాన్ని సీజ్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్

తేనె టీగల దాడిలో ఒకరి మృతి

రెబ్బెన, మే 18 : రెబ్బెన మండలం గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని రేకులగూడకు చెందిన టేకాం పోశం(68) తేనె టీగల దాడిలో మృతి చెందాడు. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. టేకాం పోశం గోలేటి శ్రీ భీమన్న ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం శ్రీ భీమన్న ఆలయానికి వెళ్లాడు. భక్తులు అక్కడే వంట చేస్తుండగా పొగ వ్యాపించి సమీపంలోని వేప చెట్టు పైనున్న తేనె టీగలు ఒక్కసారిగా లేచి పోశంను చుట్టుముట్టి దాడి చేయగా, ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోశం కుమారుడు టేకాం భీంరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.